## రంగులు

అది విశాలమైన పోలీసు పరేడు గ్రౌండు. పదిహేనోవ ఆగస్టు జండా వందనం జరిగిన తర్వాత, రంగు, రంగుల కాగితాలతో చుట్టూరా అలంకరించిన వేదిక మీద జిల్లా కలెక్టర్, ఆజిల్లాను పర్యవేక్షించే మంత్రిగారు కూర్చోగ అదే స్టేజికి ఒక వైపు ఆడవాళ్లు, మరోవైపు మగవాళ్లు కూర్చున్నారు.

వాళ్లముందు వరసలో చెరువు కట్టమీద వాలిన కొంగల్లా తెల్లని ఖద్దరు ధరించిన కొందరు, పసుపు రంగు చొక్కాలు ధరించి పొద్దుతిరుగుడు పూవుల్లా మరికొందరు, చోటబడా నాయకులు కూర్చున్నారు.

గ్రౌండ్ చుట్టూరా బాలబాలికలు నిలుచున్నారు. గ్రౌండులోపల పోలీసువాళ్ళు వరుసలొరుసలుగా విశ్రం పొజిషన్‌లో నిలుచున్నారు.

మైకు దగ్గర ఆ రోజు తామ్ర పతకాలు తీసుకోబోయే స్వాతంత్ర్యం సమరయోధుల పేర్లను పిలుస్తువుంటే ఒక్కొక్కరే వచ్చి మంత్రిగారి నుండి తామ్ర పత్రాలను తీసుకుంటున్నారు. స్వాతంత్ర్యం తెచ్చిన డెబ్బై ఏళ్లవాళ్లు దానిని నడుపుతున్న ముప్పై ఐదేళ్ల మంత్రిగారు కరచాలనం చేసుకుంటున్నారు.

మధ్యమధ్యన జనం చప్పట్లు, వయోవృద్ధులైన స్వాతంత్ర్య సమరయోధులు తమ, తమ గతాన్ని నెమరేసుకుంటు నడుస్తున్నారు. తల్లుల ధగ్గర నిలుచున్న లోయర్ కే.జీ, అప్ప్ కేజీ, పిల్లలు మమ్మీ" వీళ్లు ఏ గేమ్‌లో విన్ అయ్యారు" అని ఆశ్చర్యంగ అడుగుతున్నారు.

"జెండా చంద్రయ్య" అధికారి పిలుపు.

ఎవరూ రాలేదు.

చుట్టూ చూసి మళ్లీ పిలిచాడు.

అందరి చూపులు గ్రౌండ్ చుట్టువున్న జనాల్లో జండా చంద్రయ్య ఎవరా అని వెదుకుతున్నాయి.

అధికారి చంద్రయ్యను గూర్చిన పరిచయవాక్యాలు చెపుతూనే పోతున్నాడు.

"బ్రిటీష్ వాళ్లు నిషేదించిన ప్రాంతాలలో మనజెండా నాటుతున్నప్పుడు , శత్రువుల తుపాకీ గుండు భుజంలోంచి దూసుకుపోయింది. ప్రాణాన్ని లెక్క చేయకుండా జెండా ఎగురేసి మరఫిరంగులను తప్పించుకొని మాతృభూమి పరిరక్షణకై ప్రాణాలను లెక్కచేయని స్వాతంత్ర్య సమరయోధుడు"

కొంతమంది ఖర్చీఫ్‌తో నుదురును అద్దుకున్నారు. మరికొంతమంది కళ్లద్దాలు సరిచేసుకున్నారు. చాలామంది ఆడవాళ్లు బరువైన శ్వాసను వొదులుతూ తమను తాము మర్చిపోయి వినయ మనస్సులతో చంద్రయ్య వేసే అతికష్టమైన అడుగులను చూస్తున్నారు.

జనంలోంచి ఓ ఎముకలగూడు కదిలొస్తుంది. అందరి చూపులు ఒక్కసారే అటు మళ్లినవి. ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

వయస్సు మళ్ళి జవసత్వాలుడిగి, చేతికర్ర సహాయంతో వస్తున్న ఆయనకు కుడి చెయ్యిలేనట్లు చినిగిన గుడ్డ పేలికల్లోంచి స్పష్టంగా కనిపిస్తుంది. పాదాలకు సగం అరిగిన రబ్బరు చెప్పులు, తైల సంస్కారం లేని జుత్తు, తెల్లగా నెరసి పెరిగిన గడ్డం. రక్తప్రసారం సరిగ్గా లేక కాబోలు సోడా సీసాల్లోని సీసపు గోళీలాగ సత్తువను,

జీవకళను కోల్పోయిన కనుగుడ్లు. జీవితంలోని లోతుపాతులను, కష్టసుఖాలను జీర్ణం చేసుకొని, ముడతపడ్డ ముఖం. వెన్నంటిన డొక్కలో ఏ ఆసరాలేదని చూస్తేనే తెలుస్తుంది.

"వీరి ధైర్య సాహసాలకు, త్యాగబుద్ధికి మెచ్చుకొని మన ప్రభుత్వం తామ్రపత్ర బహూకరణను ప్రకటించింది." అన్న పరిచయ వాక్యాలు విన్న మంత్రిగారు కదిలి కూర్చుంటు నుదుటి మీద చెమటను ఖర్చీఫ్‌తో అద్దుకున్నాడు.

రోజూ చద్దన్నంకోసం యిల్లిల్లు తిరిగే ఈయన స్వతంత్ర్య సమరయోధుడా? అంటూ ఆడవాళ్ల గుంపులో గుసగుసలు.

బస్టాండ్ దగ్గర అడుక్కుంటు తిరిగే ఈ అవిటివాడు తెల్లదొరల నెదిరించి జెండా నాటాడులే...ఒఫ్! అంటూ మగవాళ్ళు, బడిపిల్లలు మాత్రం చరిత్ర పుస్తకంలో లేని పాఠం గదూ అని ఆసక్తితో వింటూ రెప్పవాల్చకుండా చూస్తున్నారు.

చంద్రయ్య కళ్లల్లో గతం కదలాడింది. పాతికేళ్లప్పుడు వూరొదలి తల్లి దండ్రుల మాటకాదని పెళ్లిగూడ చేసుకోక,

చేసుకుంటే తాను కుటుంబ జీవితానికే పరిమితమైపోతానేమోనన్న భయంతో రాత్రింబవళ్లు తిండి నిద్ర ఎరుగక దేశమంతా తిరిగిన రోజులు దేశ స్వాతంత్ర్యం కోసం తిన్నలాఠీదెబ్బలు ఒక్కొక్కటీ గుర్తొస్తున్నాయి.

స్వరాజ్యం రావాలని దేశమంతా ఒక్కటై తెల్లోని పాలనకు వ్యతిరేకంగా పోరాడిన రోజులు కళ్లముందు నిల్చినవి. సత్యాగ్రహాలు, సహాయనిరాకరణ, విదేశీ వస్త్ర బహిష్కరణ, ఉద్యమ నాయకులు జైళ్లల్లో ప్రతివానిలో ఓ ఉత్తేజం పొటమరిచింది.

తెలంగాణాలో నిజామ్ రాచరికానికి వ్యతిరేకంగా సామాన్యుడు ఎదురుతిరిగి తుపాకి పట్టాడు. ఆడవాళ్ళు నడుంకట్టి ముందుకొచ్చిపోరాటానికి, ఊపిరి పోశారు. నవాబుల తాబేదార్లు అయినా దొరల, భూస్వాములను మట్టికరిపించారు. ఏదోకొత్తసత్తువ అతనిలో నిండుకొంది. ఓ హుందాతనం చోటు చేసుకోగా నడకలో వేగం పెరిగింది. ఆనాడు తన భుజంలో తుపాకి గుండు దూసుకు పోయినప్పుడు లెక్కచేయకుండా నడిచిన నడక, చేతిలో రెపరెపలాడే జండా, ఎన్ని మరఫిరంగుల ధ్వనులు!

ఈ లోపున స్టేజీ దగ్గరికి చేరేసరికి అతని మనస్సు

తన ఊరువెళ్లింది.

'తన వూళ్లోని తన యిల్లును రజాకిర్లు తగుల బెట్టిరి. తన గూర్చిన ఆ చూకి చెప్పనందున తనతండ్రిని కాల్చిచంపిరి. తనరాకకోసం ఎదురుచూసి, చూసి తన తల్లి కళ్లు మూసె. అయినా తనకు ఒక్క ఊరేమిటి ఈ దేశమే ఓ ఊరు" అనుకుంటు నడుస్తున్న చంద్రయ్య ఆగి ఓసారి వేదికమీద కూర్చున్న వాళ్లను చూశాడు.

వర్తమానం వరదలా వచ్చి తనను ఉక్కిరిబిక్కిరి చేసింది. తెల్లోనిపాలన కన్న నల్లోల్లపాలన ఏం మెరుగ్గా లేదు. ఆదోపిడి మోసం, అందుబాటులోలేని ధరలు, ధగాకోరు ఎన్నికలు, అమ్ముడు పోయే ఓట్లు పదిమందికో పార్టీ. కాదంటే కత్తిపోట్లు. కుల అహంకారపు దౌర్జన్యాలు, పాడిపరిటలు తరిగి పల్లెలు పాడైపోతుంటే నకిలీ సరుకులతో పట్టణాలు బల్సిపోతున్నై. మత తగాదాలతో మారణహెూమం సృష్టించుకుంటున్నారు. అబ్బా ఏం బతుకులో అనుకుంటు చుట్టూ చూశాడు.

తోటలో పూసిన రంగురంగుల పూలలా చుట్టూర బాల బాలికలు.

ఎదురుగ స్టేజిమీద చేతిలో తామ్రపత్రంతో మంత్రిగారు.

మంత్రిగారిముఖం వైపు తామ్రపత్రం వైపు చూపులను మార్చి మార్చి చూస్తున్నాడు చంద్రయ్య.

జనం చప్పట్లు కొట్టారు. కడుపులో ఆకలి ఒక్కసారే పేగును మెలిపేసింది. అడుగుతీసి అడుగు వేయటం కష్టమైపోయింది. ఆరోజుల్లో అసలే గుర్తురాని ఆకలి యిప్పుడు అడుగడుగున కుంగదీస్తుంది. యిక తనువు చాలిస్తే బాగుండు. అనుకుంటూ యింకా చప్పట్లు కొడుతున్న బాలబాలికలవైపు చూశాడు.

ఏదోకొత్త ఆశ అతని కళ్లల్లో మెరిసింది. "వీళ్లైనా రేపు ఈ దేశాన్ని బాగుచేసుకొంటారో" అనుకుంటు వెనక్కు మళ్ళి పిల్లలు నిలుచున్న వైపు నడిచాడు.

●